## కథ

పులిపాక కనకదుర్గ

# అద్వైతం

**మొదటిసారి పార్వతిని చూసింది మా ఇంట్లోనే!**

**శివపూజ పట్టు వేస్తుండగా గుమ్మం అవతలే ఆగిపోయి చెప్పేడు శ్రీశైలం ''నాన్నగారు మీ కోసం విశ్వనాథశాస్త్రిగారి కోడలు పార్వతి వచ్చింది. ఇక్కడికి పిలవమంటారా?''**

**''అవసరం లేదు ఆమెను ముందర గదిలోనే కూర్చోబెట్టు. శివపూజ ముగిసేవరకు వేచి ఉండమని చెప్పు''**

మధ్యలో అమ్మాయి అపర్ణ, శ్రీశైలం పూజగది గుమ్మం దాకా వచ్చినా పలకరించే సాహసం చేయలేక వెనక్కి వెళ్లిపోయేరు. పూజ ముగించి, భోజనం కానిచ్చి మడిబట్టలు మార్చుకుని బయటకు వచ్చే సరికి ఆమె ఇంకా ఎదురుచూస్తూనే ఉంది.

నన్ను చూడగానే చప్పున లేచి నిల్చుంది. పక్కనే తన కొంగు పట్టుకుని ఏడేళ్ల కుర్రాడు. ఇంతలేసి కళ్లతో బెదురుగా చూస్తున్నాడు.

పడక్కుర్చీలో కూర్చుంటూ తనను కూడా కూర్చోమన్నట్టుగా కుర్చీ చూపించేను. ఫరవాలేదన్నట్టుగా తలూపి అలానే నిలబడి ఉంది.

''ఏమ్మా నువ్వు విశ్వనాథశాస్త్రిగారి కోడలివి కదూ? నాతో ఏమైనా పని పడిందా, శ్రమపడి ఇంత దూరం వచ్చేవు?'' కళావిహీనమైన ఫాలభాగంతో, దైన్యానికి ప్రతీకలా ఉన్న ఆమెను చూసి తెలియని జాలి కలిగి మార్దవంగా అడిగేను.

ఏదో చెప్పటానికి అన్నట్టు ఉపక్రమించి తిరిగి సంకోచంగా ఆగిపోయింది.

''చల్లకొచ్చి ముంత దాచినట్టు ఇక్కడి దాకా వచ్చి సందేహిస్తావెందుకు? ఏం ఫర్వాలేదు ధైర్యంగా చెప్పేయి'' పళ్లెంలో తమలపాకు చిలకలతో వచ్చిన శ్రీమతి చిరునవ్వుతో భరోసా ఇచ్చింది. కాత్యాయని వెనకనే పదేళ్ల అపర్ణ, పధ్నాలుగేళ్ల శ్రీశైలం వచ్చిన వారిని కుతూహలంగా చూస్తున్నారు.

కాస్త ఎడంగా ఉన్న పిల్లవాడిని దగ్గరకు తీసుకుని నేలచూపులు చూస్తూ చెప్పింది. ''శాస్త్రిగారూ వీడు మా అబ్బాయి చంద్రం. వాడు నెలల పసిగుడ్డుగా ఉండగానే వారు గతించారు. తిన్నామో, తినలేదో బయటకు తెలియకుండా రోజులు గడుపుకొస్తున్నాం. వీడికిప్పుడు ఏడేళ్ల వయసు. సంప్రదాయానుసారం ఉపనయనం చేయించాలని వారి సంకల్పం'' ఆపైన చెప్పటానికి సందేహిస్తున్నట్టు ఆగిపోయింది.

తక్కువ రకం ముతకచీరలో పేదరికానికి ప్రతిరూపంలా ఉన్నా సహజ సౌందర్యంతో ప్రకాశిస్తోంది. తన సంశయాన్ని గ్రహించిందేమో కాత్యాయని అందుకుంది. ''మరేమీ లేదు. వాళ్ల అబ్బాయి ఒడుగు మీ చేతులమీదుగా జరిపించాలని మీ కోసం ఇంత దూరం వచ్చింది''

''అవును అయ్యగారూ మీరు కరుణ హృదయులని, శైవసంప్రదాయం పట్ల ఆదరాభిమానాలు మెండుగా కలవారని, మా విన్నపాన్ని కాదనరన్న నమ్మకంతో వచ్చేను''

''అది సరేగానీ మన అగ్రహారంలోనే మీ వారి అన్నగారి కుటుంబం ఉన్నట్టుంది. వారిని అడిగి ఉండవలసింది''

''ఆ ముచ్చట కూడా అయ్యిందట. కాదు పొమ్మన్నారట'' నిరసనను వ్యక్తపరుస్తూ చెప్పింది కాత్యాయని.

''ఔరా!'' ముక్కున వేలేసుకుని అచ్చెరువొందకుండా ఉండలేకపోయేను.

ఉపనయన సంస్కారం కావిస్తే పుత్రసమానుడవుతాడు. అందునా తమ్ముడి కొడుకు. రేపటి రోజున ఆస్తిలో వాటా అడిగినా అడగవచ్చునన్న వ్యర్థానుమానం. పిల్లవాడి పెద్దనాన్న ఆంతర్యం అవగతమయ్యింది. మానవత్వం ఉనికి సైతం మటుమాయం చేసిన స్వార్థమనే పెనుభూతం వేయితలలతో వికటాట్టహాసం చేస్తూ కళ్లెదుట సాక్షాత్కరిస్తుంటే చిన్నగా నిట్టూర్చి చెప్పేను.

''మంచిది తల్లీ. పిల్లవాడికి అన్ని విధాలా అనువయిన సుముహూర్తం కుదరగానే ఉపనయన సంస్కారం కావిద్దాం''

సంతోషంగా నిష్క్రమించేరు తల్లీకొడుకులు.

ఆ తరువాత వేదోక్తంగా చంద్రశేఖరుడి ఉపనయనం ముగిసింది. పంచశిఖలతో చిన్నారి చంద్రశేఖరుడు బాలశివుడిలా ప్రకాశిస్తున్నాడు. పార్వతి కళ్లల్లో కన్నీటి భాష్పాలతో పాటు ఎనలేని తృప్తి. మాతాపితరుల స్థానంలో ఉన్న మేము చంద్రునికో నూలుపోగు అన్న చందంగా చంద్రానికి వెండి పళ్లెరం, నూతన వస్త్రాలు బహూకరించేము.

అనుకోని విధంగా అమరిన చుట్టరికం ఆ తరువాత కూడా కొనసాగింది.

వంటలకని, వడ్డనలకని, ఆవకాయలకని, వడియాలకని ఏదో విధంగా పార్వతి మా ఇంటికి రాకపోకలు సాగించింది. తన చేతిలో ఏది పెట్టినా కొడుకుకి తీసుకువెళ్లేది.

''పార్వతి ప్రాణాలన్నీ చంద్రం మీదే పెట్టుకుని బ్రతుకుతున్నదండీ. రెక్కలు ముక్కలు చేసుకుని కొడుకు కోసం మగాడిలా కష్టపడుతోంది'' జాలిగా చెప్పిందోసారి కాత్యాయని.

''తల్లిని మించిన దైవం మరొకరు లేరు కాత్యాయని. దేవుడు అన్నింటా తాను ఉండలేక తల్లిని తనకు బదులుగా, తన ప్రతినిధిగా మానవాళికి అందించేడు. అందుకే అగ్రస్థానం తల్లికే కట్టబెట్టేరు. మాతృదేవోభవ అని ముందుగా తల్లినే కదా తలుచుకునేది''


చంద్రం చదువు విషయంలో సలహాల కోసమని అడపాదడపా నన్ను కలవటానికి వస్తుండేది పార్వతి. చంద్రం కూడా చదువులో చాలా చురుకయిన కుర్రాడు.

''మనది లంకంత ఇల్లు. ఓ రెండు గదులు పార్వతికి ఇద్దామండి. తనకూ అద్దె కలిసి వస్తుంది. మనదా నిత్యసంతర్పణలు జరిగే ఇల్లు. నాకూ కాస్త ఆసరాగా ఉంటుంది. ఎలాగో పదో, పరకో ముట్టచెబుతాం కాబట్టి తనకు ఆర్థికంగా కాసంత అసరగానూ ఉంటుంది'' ఏవో మాటల సందర్భంలో మనసులో మాటను వెల్లడి చేసింది కాత్యాయని.

'అర్ధాంగి, అందులోనూ భేషైన మాట చెప్పింది. ఇంక కాదనేందుకేముంది?'

ఇప్పుడు పార్వతి, చంద్రం కూడా మా కుటుంబ సభ్యులు. చంద్రం కూడా పదేళ్లవాడయ్యాడు. చంద్రాన్ని చూసినప్పుడల్లా మనసుకు ఎంత ప్రమోదంగా ఉంటుందో, అదే సమయంలో శంకరం గుర్తుకొచ్చి మనసు భారమవుతుంటుంది.

శంకరం స్వయానా నాకు తమ్ముడి కొడుకు. వాడికి కూడా ఇంచుమించు చంద్రం వయసే ఉంటుంది. వ్యసనాలకు బానిసయిన నీలకంఠం



కొడుకుతో బాటు కుటుంబాన్ని కూడా ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదు.

అంతకంటే బాధాకరమైన విషయం ఏమిటంటే శంకరానికి తండ్రి పట్ల ద్వేషభావం.

వయసుతో పాటు ఆ ద్వేషం కూడా పెరుగుతూ వస్తున్నది.

తమ్ముడి కుటుంబానికి నాకు చేతనయిన సాయం చేస్తూ శంకరాన్ని నేనే చదివిస్తున్నాను. జరుగుతున్న వాటితో తనకేమాత్రం నిమిత్తం లేనట్టు కాలం గడుస్తూనే ఉంది.

ఆ రోజు నేను ఎన్నటికీ మరువలేని రోజు. మళ్లీ జన్మంటూ ఉంటే స్త్రీగా జన్మించి అమ్మనై మాతృత్వపు ఔన్నత్యం అంచులను స్పృశించాలని మనసు కరిగి నీరయిన రోజు.

★ ★ ★

చాలాకాలం తరువాత దివాకరం నన్ను కలవటానికి వచ్చేడు. వాడు నా చిన్ననాటి నేస్తం. కాకపోతే వయసులో కొంచెం చిన్న. చిన్నతనం నుంచి అభ్యుదయభావాలు మెండుగా ఉన్నవాడు. కలవక, కలవక కలిసిన అరుదయిన కలయిక కావటంతో మా మధ్య ఎన్ని కబుర్లు దొర్లినా తనివితీరలేదు.

కాత్యాయనికి చిన్నపాటి సుస్తీ చేయటంతో పార్వతే వంటా, వడ్డనా అంతా తానే చూసుకుంటోంది. ముందే తన గురించి చెప్పటంతో పార్వ


తిని జాలిగా చూసేడు దివాకరం.

ఇద్దరం వంటరిగా ఉన్నప్పుడు తన మనసులో ఉద్దేశాన్ని బయటపెట్టేడు.

విషయం విన్న నన్ను నేనే నమ్మలేకపోయేను. భార్య దూరమైన తరువాత మారు మనువు మాట తలపెట్టని దివాకరం పార్వతికి అభ్యంతరం లేకపోతే ఆమెను పునర్వివాహం చేసుకుంటానన్నాడు. పార్వతి కనుక ఈ ప్రతిపాదనని అంగీకరిస్తే తనంత అదృష్టవంతురాలు ఎవరూ ఉండరు. దివాకరం యోగ్యుడు, ఉత్తముడు. అతని సాహచర్యంలో

## అందాల రాశి అశిన్

**కేరళ కుట్టి అశిన్ తెలుగుతోపాటు తమిళం లోనూ తన టాలెంట్‌ని రుజువు చేసుకుంటోంది. ఇటీవల ఇప్పుడున్న తారల్లో అందగత్తె ఎవరు? అనే ఓ సర్వేని తమిళనాడులో ఓ సంస్థ వారు నిర్వహించారు. అందులో యువత అంతా అశిన్‌కే తమ ఓట్లు వేసి ఆమెనే అందగత్తె అని అభిప్రాయాల్ని చెప్పారట. తెలుగులో 'అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి'లో నటించిన అశిన్ ఆ సినిమా తమిళ వెర్షన్‌లోనూ నాయికగా నటించింది. ఈ సినిమా హిందీలో కూడా నిర్మాణం జరుపుకుంటుందిట. అందులో కూడా అశిన్‌నే హీరోయిన్‌గా తీసుకోవాలని నిర్మాతలు అనుకుంటున్నారట.**



పార్వతి జీవితం తిరిగి చిగురిస్తుంది. చంద్రాన్ని కూడా సొంత బిడ్డలా చూసుకోగల హృదయ వైశాల్యం దివాకరానికుంది.

కాకపోతే విషయాన్ని పార్వతి దగ్గర ఎలా కదల్చాలో ఓ పట్టాన తెలియలేదు.

నువ్వని నేను, కాదు మీరేనని కాత్యాయని వంతులు వేసుకుని వాయిదాలు వేయటంతో విషయం తేలకుండానే రెండు నెలలు గడిచిపోయేయి.

ఇలా ఇలా కాదనుకుని ఓ మంచి రోజున ఇరువురమూ కలిసి పునర్వివాహ ప్రస్తావనను పార్వతి ముందర తీసుకొచ్చేము.

''చూడమ్మా పార్వతి ఈ రోజుల్లో పునర్వివాహం సాధారణమైన విషయమే. పైగా నీకేమంత వయసయ్యిందని ఎంతో భవిష్యత్తు ఉన్నదానివి. దివాకరం చాలా ఉత్తముడు. చంద్రం గురించి కూడా నువ్వేమీ దిగులు చెందనక్కర్లేదు'' కన్విన్సింగ్‌గా చెప్పేను.

''క్షమించండి ఈ ప్రతిపాదనను నేను అంగీకరించను. ఈ వివాహం చేసుకుని చంద్రం పసిమనసును నొప్పించలేను. ప్రశాంతంగా ఉన్నవాడి మనసులో లేనిపోని ఆందోళనలను కలిగించలేను. నెలల పసికందుగానే తండ్రిని కోల్పోయిన కసుగాయి నా బిడ్డ. తల్లయినా, తండ్రయినా వాడికి నేనే. మరో వివాహం చేసుకుని వాడి భవిష్యత్తుని అయోమయం చెయ్యలేను. నాకు వాడి భవిష్యత్తు ముఖ్యం. చిన్నపాటి రిస్కు నయినా నేను తీసుకొనలేను'' ఒక్క క్షణమయినా ఆలోచించకుండా నిష్కర్షగా చెప్పింది. అప్పుడనిపించింది జన్మంటూ ఉంటే అమ్మనయి ఔన్నత్యపు అంచులను స్పృశించాలని. గుండెల్లో దాచుకుని పెంచే తల్లి రెక్కలమాటున చంద్రం దినదినప్రవర్థమానమయ్యేడు.

ఏ సౌఖ్యమూ అనుభవించకుండానే పార్వతి యవ్వనం, సౌందర్యం కళ్ల ముందే అడవిగాచిన వెన్నెలయ్యింది.

పార్వతి పార్వతమ్మ అయ్యింది.

ఆమె కష్టం ఫలించి చంద్రం ప్రయోజకుడయ్యాడు. అత్యున్నతమైన ఐ.ఐ.టి నుంచి ఇంజినీరింగ్ పట్టభద్రుడయ్యేడు.

శ్రీశైలం బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. అపర్ణ పెళ్లిలో బాధ్యతలతోపాటు సందడంతా తానే అయ్యేడు. అపర్ణ భర్త కూడా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. పెళ్లయిన నెల రోజులకే వీసా రావటంతో అపర్ణ కూడా అమెరికా పయనమయ్యింది.

వయసయిన ముగ్గురం ఇంటిపట్టున మిగిలాము.

మరికొద్ది రోజులకు చంద్రం పై చదువుల నిమిత్తం అమెరికా వెళ్లేడు.

ఎటొచ్చీ తమ్ముడు నీలకంఠం పరిస్థితే అస్సలు బాగోలేదు. వ్యసనాల కారణంగా ఆరోగ్యం బాగా క్షీణించింది. ఇహ శంకరానికి ఎటు తిరిగి తండ్రంటే అసహ్యమే. అక్కడికి శంకరంతో చాలా సార్లు చెప్పి చూశాను. ''శంకరం ఎంతయినా ఆయన నీ తండ్రి. తండ్రి పట్ల అంత ద్వేషం పనికిరాదు''

''పెద్దనాన్నా మీరంటే నాకు చాలా గౌరవం. ఆ మనిషి పేరు చెప్పి దయచేసి ఆ గౌరవం తగ్గేలా చేయకండి. మీరెన్ని చెప్పినా ఆయన పట్ల నాకు గౌరవం కలుగదు'' నిక్కచ్చిగా చెప్పేడు శంకరం.

'ఒక రకంగా వాడు చెప్పింది కూడా నిజమే. నీలకంఠం ఏనాడూ తండ్రిలా బాధ్యతలెరిగి ప్రవర్తించలేదు. సాటి పిల్లలందరూ ఉన్నంతలో చక్కగా పెరిగితే వీడెన్నో ఇక్కట్లు పడ్డాడు. స్కూలు ఫీజులు కట్టలేక వాడి చదువు ఎంతగా కుంటుపడిందో నాకు తెలుసు. సరయిన బట్టలు లేక, పోషణ లేక వాడెంత హీనమయిన బ్రతుకు గడిపింది వాడి కంటే ఎక్కువగా తెలుసు. వాడు అనుభవించిన ప్రతీ అవమానం వాడి పసి హృదయంలో తండ్రి పట్ల ఎంత ద్వేషాన్ని రగిల్చిందీ తెలియందికాదు'

భగవంతుడి దయ వల్ల ఈమధ్యనే శంకరానికి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. ఇప్పటికయినా వాడి కష్టాలు ఒక కొలిక్కి వచ్చినందుకు సంతోషించిన వాళ్లల్లో నేనే మొదటివాడిని.

జీవితంలో సెటిలయ్యినా తండ్రి పట్ల శంకరం ద్వేషం మచుకు ఎంతమాత్రమూ తగ్గలేదు. ఏళ్లు గడిచినకొద్దీ ఆ ద్వేషం మరింత పెరిగింది.

''అన్నయ్యా చూశావా శంకరం ఎంత పని చేశాడో?'' ఎప్పటిలాగే శంకరం మీద ఫిర్యాదు చేయటానికి వచ్చిన నీలకంఠాన్ని చూసి ''ఏం చేసేడేంటి?'' అడిగేను.

''ఎన్నో మంచి సంబంధాలు వస్తున్నా కాదని ఎవరో అన్యకులస్థురాలిని ప్రేమించేడట. ఆ పిల్లనే చేసుకుంటాడట''

''శంకరాన్ని విచారిస్తే నిజమేనని అంగీకరించేడు. అవును పెద్దనాన్నా ప్రేమరాహిత్యంతో బాధలు పడ్డ నాకు సునీత ఆ ప్రేమను పుష్కలంగా పంచిచ్చింది. ఆమెను తప్ప వేరెవరిని జీవితంలోకి ఆహ్వానించలేను'' నిక్కచ్చిగా చెప్పేడు.

చిన్నపిల్లవాడికయితే చెప్పగలం. పాతికేళ్ళు దాటిన యువకుడికి ఏం చెప్పగలం? అయినా మనువుకు కావల్సింది మనసులు కలవటంగానీ మరొకటి కాదు. ఎవరి అనుమతితో నిమిత్తం లేకుండా శంకరం వివాహం నిరాడంబరంగా జరిగిపోయింది.

''శ్రీశైలానికి ముందుగానే మేనరికం నిర్ణయించి నీ చేతులమీదుగా పెళ్లి జరిపించి మంచి పని చేశావు అన్నయ్యా'' శంకరం పెళ్లి విషయంలో తన మాట నెగ్గలేదన్న ఉక్రోషాన్ని వెళ్లగక్కేడు నీలకంఠం.

''ఏమిటయ్యా నీలకంఠం పెళ్లయిపోయిన తరువాత ఏమిటా మాటలు? సునీత ఇప్పుడు మనింటి కోడలు. అయినా పెళ్లిళ్లు నిర్ణయించేటప్పుడు చూడవలసింది గుణగణాలు తప్ప వేరొకటి కాదు. సునీతకేం బంగారం లాంటి పిల్ల. శంకరం లాంటి దుందుడుకు స్వభావం కలవాడికి అలాంటి నిదానస్తురాలయిన అమ్మాయి అయితేనే సరిపోతుంది'' ఎన్నడూ లేనిది కాత్యాయని నీలకంఠాన్ని గట్టిగా మందలించింది.

★ ★ ★

''ఎక్కడి అమరావతి ఎక్కడి న్యూయార్క్?''

నెల రోజులవుతోంది ఇక్కడకు వచ్చి. పెళ్లయిన అయిదేళ్లకు అపర్ణ కడుపు పండి పండంటి మగబిడ్డకు తల్లయ్యింది. ముందు కాత్యాయనినొక్కదాన్నే పంపిద్దామని అనుకున్నాం. కానీ అత్యవసరంగా అల్లుడికి ఇండియాలో నెల రోజులు ట్రైనింగ్ ఉండటంతో నేను కూడా కాత్యాయనితో పాటు ఇక్కడికి రావల్సి వచ్చింది. నేడో, రేపో అల్లుడు తిరిగి అమెరికా వచ్చెయ్యవచ్చు.

ఇంతలోనే పార్వతమ్మ నుంచి ఫోన్ చంద్రానికి వివాహం నిశ్చయమయిందన్న శుభవార్తతో. శంకరం పెళ్లప్పుడే అనుకుంటా చంద్రం విదేశాల్లో ఉన్నతవిద్యను ముగించుకుని ఇండియాలో నెలకు లక్షకు పైచిలుకు జీతంతో మంచి ఉద్యోగంలో చేరాడని. మంచి ఇల్లూ అదీ చూసుకుని తల్లిని తన దగ్గరకే తీసుకువెళ్లేడు.

చంద్రం పట్టుబట్టి మా దంపతులిద్దరిని ఇంటికి తీసుకెళ్లి పట్టుబట్టలు పెట్టేడు. ఆఫీసు వాళ్లిచ్చిన అందమైన భవంతి, ఇంటి ముందర ఎప్పుడూ డ్రైవర్‌తో సహా సిద్ధంగా ఉండే ఖరీదైన కారు, వంటపనికి, తోటపనికని మనుషులు పార్వతమ్మ వైభవం చూసి సంతోషంతో కడుపు నిండిపోయింది.

ఇదంతా ఏడాది క్రిందటి మాట.

ఇప్పుడు చంద్రం కూడా ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఇండియాకు వెళ్లగానే తిన్నగా చంద్రం ఇంటికే వెళ్లేను. వివాహ శోభతో ఇల్లంతా దేదీప్యమానంగా ఉంది. చంద్రం కాబోయే భార్య స్వర్ణ పేరుకు తగ్గట్టు బంగారపు బొమ్మలా ఉంది. అన్నట్టు ఆ అమ్మాయి కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరే నట. వియ్యాలవారు కూడా చాలా సంపన్నులట.

వైభవోపేతంగా చంద్రం పెళ్లి జరిగింది.

పార్వతమ్మ ఆనందానికి అంతు లేదు.

భగవంతుడు చల్లగా చూడటంతో ఆమె ఆనందం నాలుగేళ్ల వ్యవధిలో ఇద్దరు మనవలకు నాయనమ్మయి రెట్టింపయ్యింది.

అసలు కంటే వడ్డీ ముద్దని ఎవరన్నారోగానీ పార్వతమ్మను చూస్తుంటే అక్షరసత్యమనిపిస్తుంది. ఆమెకిప్పుడు మనవలతోడిదే లోకం.

''అమ్మవల్లే నేనూ, స్వర్ణా పిల్లల గురించి కానీ, ఇంటి గురించి కానీ ఏ టెన్షన్లు లేకుండా నిశ్చింతగా ఉద్యోగాలు చేసుకోగలుగుతున్నాము'' చంద్రం తరచుగా నాతో అనే మాట. సొంత చెల్లెలి కంటే ఎక్కువయిన పార్వతమ్మ ఇంటికి అడపాదడపా రాకపోకలు సాగిస్తూనే ఉన్నాం.

వార్థక్యం పార్వతమ్మ మీద ప్రభావం చూపటం ప్రారంభించినట్టుంది. ఇదివరకటికి మల్లే పనులు చేసుకోలేకపోవటం గమనించేను. ''ఎందుకొచ్చిన ఆరాటం పార్వతమ్మా? హాయిగా బరువుబాధ్యతలు చంద్రానికి వదిలేసి విశ్రాంతి తీసుకోరాదు''

''ఇప్పుడేమయ్యిందని అన్నయ్యా? బాగానే ఉన్నానుగా'' ఓ పక్కన రొప్పుతూనే మనవల్ని సముదాయించింది.

మనవల మీద పార్వతమ్మ ప్రేమ ఎంత గాఢమయిందో తెలిసిన నేను మరేమీ మాట్లాడక మిన్నకుండిపోయేను.

క్రమేపీ నాలో కూడా సత్తువ క్షీణించడంతో ఇంటిపట్టునే ఉండిపోవడం ప్రారంభించేను.

★ ★ ★

నీలకంఠాన్ని శంకరం ఓల్డేజి హోంలో చేర్పించేడు.

ఒక్కసారయినా వచ్చి చూసిపొమ్మని ఫోన్లలో ఒకటే గొడవ. శరీరం సహకరించక ఆర్నెల్లుగా వాయిదా వేస్తున్నాను. శంకరం సంగతి సరేసరి. తండ్రి పేరంటేనే పరమ అసహ్యం. పార్వతమ్మను చూసి కూడా చాలా కాలమయ్యింది. తనను కూడా చూసొచ్చినట్టుంటుందని కాత్యాయనితో కలిసి బయలుదేరేను.

మమ్మల్ని చూడగానే నీలకంఠం భోరుమన్నాడు.

వాడి దైన్యస్థితి చూసి నా గుండె తరుక్కుపోయింది. అందరూ ఉన్నా ఎవరూ లేనివారిలా, ఎవరిని ఏమీ కానివారిలా జీవితపు చరమాంకంలో దుర్భర వేదన అనుభవిస్తున్న ఆ ఆశ్రమవాసుల్ని చూస్తే పగవాళ్లక్కూడా ఈ స్థితి రాకూడదనిపించింది.

ఎలాగయినా శంకరానికి నచ్చచెప్పి నీలకంఠాన్ని తిరిగి ఇంటికి తీసుకురావాలని మనసులోనే నిర్ణయించుకున్నాం.

వెనుదిరిగి వస్తుంటే చిన్నపిల్లవాడిలా వెక్కిళ్లు పెట్టేడు నీలకంఠం.

భారమైన గుండెలతో వెనుదిరిగేము. నడుస్తున్న శవాలకు మల్లే భావరహితంగా, నిర్జీవంగా పనులు చేసుకుంటున్న సాటి వృద్ధులు. ఆ కొద్ది పాటి సత్తువ కూడా లేనివాళ్లు గదుల్లోనే ఉండిపోయేరు.

ఒక్కో గదిలో ఒక్కో జీవచ్ఛవం.

ఒక్కో అడుగూ కష్టం మీద వేసుకుంటూ వస్తున్న నేను ఉన్నట్టుండి షాకయ్యేను!

నా కళ్లను నేనే నమ్మలేకపోయేను!

నిస్తేజమైన గాజుకళ్లతో శూన్యదృక్కులతో అక్కడ ఓల్డేజి హోంలో పార్వతమ్మ.

కాళ్ల కింద భూమి కదిలినట్టయ్యింది.

మానవత్వం మీద నమ్మకం పోయి అనుబంధాలంటే అసహ్యం కలిగిన క్షణమది.

కాత్యాయని సంగతి సరేసరి. నోట మాట రానంతగా షాకయ్యింది.

పార్వతమ్మ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. చాలా డీప్ షాక్‌లో ఉంది.

పీక నులిమి చంపేద్దామన్నంత కోపంతో చంద్రం ఇంటికి వెళ్లేను.

''ఏం చేయమంటారంకుల్? ఈ మధ్యన ఆవిడ ఆరోగ్యం బాగా దెబ్బతింది. ఇంట్లోనే ఉంచితే పిల్లలకు ఇన్ఫెక్షన్స్ వచ్చేట్టుంది. హాస్పిటల్లో చేర్పిద్దామంటే అంత సీరియస్ కాదు. మేమిద్దరమూ బిజీ. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం'' చంద్రాన్ని మందలిస్తుంటే కలుగజేసుకుని తీవ్రంగా స్పందించింది స్వర్ణ.

తనకేమీ పట్టనట్టు పేపర్లో తలదూర్చిన చంద్రాన్ని చూస్తుంటే జీవితంలో వాడి మొహం చూడకూడదన్నంత అసహ్యం వేసింది. చెరుకు నుంచి రసాన్ని పిప్పి చేసిన మాదిరిగా తల్లిని చివరి రక్తపుబొట్టు వరకూ వినియోగించుకుని ఆమెకు సేవలు చేయాల్సిన తరుణం రాగానే నిర్దాక్షిణ్యంగా ఆమెను నెట్టివేసిన ఆ స్వార్థపరుణ్ణి చూస్తే అసహ్యం వేసింది.

అక్కడుండి చేయగలిగింది ఏమీ లేదని స్పష్టమయ్యేక వెనుదిరిగేము.

బయటకు వచ్చి గేటు వేస్తుంటే చంద్రం కొడుకుల్ని ముద్దాడుతున్న దృశ్యం కనిపించింది.

ఎంత వద్దన్నా విరక్తితో కూడిన నవ్వొకటి మెరిసింది నా పెదాలపైన.